# వివాహిత స్త్రీల ఆస్తి చట్టము, 1874

(1874లోని 3వ చట్టము)

(24 వ ఫిబ్రవరి 1874)

కొందరు వివాహిత స్త్రీలకు సంబంధించిన శాసనమును విశదీకరించుటకును, సవరించుటకును, మరియు ఇతర ప్రయోజనముల కొరకును అయిన చట్టము. ప్రస్తావన.

1866 జనవరి మొదటి దినమునకు పూర్వము వివాహము జరిగినట్టి స్త్రీలు తమ వేతనములను, సంపాదనలను అనుభవించు విషయముననను, ఆ తేదీకి పూర్వముగాని తరువాత గాని వివాహము జరిగిన వ్యక్తుల జీవిత భీమా విషయముననను, ఇందు ఇటు పిమ్మట ఉన్నట్లు నిబంధనలు చేయుట ఉపయుక్తమై యున్నందునను;

ఏ వ్యక్తికిని, అతడు లేక ఆమె వివాహము చేసికొనిన వ్యక్తి యొక్క ఆస్తియందు ఎట్టి హితముగాని ఆ వివాహము వలన చేకూరదనియు, వివాహము కాకుండినచో తన సొంత ఆస్తిని గూర్చి తాను చేయగలిగియుండెడి ఏ కార్యమునైనను చేయుటకు ఆ వివాహము వలన అతనికి లేక ఆమెకు అర్హత లేకుండా పోదనియు భారత ఉత్తరాధికార చట్టము1865, యొక్క 4వ పరిచ్ఛేదము ద్వారా అనుశాసింపబడినందునను; 1865 లోని 10 వ చట్టము.

సదరు చట్టమును బట్టి ఎవరి వివాహములకు ఆ చట్టము వర్తించునో ఆ స్త్రీలందరు వారియందు నిహితమైన లేక వారిచే ఆర్జింపబడిన సమస్త ఆస్తికి సంపూర్ణ యజమానులైయుండి వారి వివాహము వలన వారి భర్తలకు అట్టి ఆస్తియందు ఎట్టి హితము చేకూరకున్నను, వివాహమునకు పూర్వము తమ భార్యలచే చేయబడిన ఋణముల బాపతు బాధ్యతలనుండి అట్టి భర్తలకు సదరు చట్టము రక్షణ కల్పించక, అట్టి భార్యలచే లేక అట్టి భార్యలపై క్లెయిములను అమలు జరుపుటకు అభివ్యక్తముగా నిబంధనలు చేయునందునను;

ఇందుమూలముగా ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది.

## ప్రారంభిక – 1

1. ఈ చట్టమును వివాహిత స్త్రీల ఆస్తి చట్టము 1874 అని పేర్కొన వచ్చును. సంక్షిప్తనామము

2. ఇది జమ్మూ కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును. విస్తరణ మరియు వర్తింపు

కాని ఏ వివాహిత స్త్రీకైనను, ఆమెగాని ఆమె భర్తగాని వారి వివాహ సమయమున హిందూ, మహమ్మదీయ' భౌద్ధ, సిక్కు, లేక జైన మతములలో దేనినైనను అవలంభించి యుండినచో ఈ చట్టములో నున్న దేదియు వర్తించదు'

మరియు (రాజ్య ప్రభుత్వము) ఏదేని జాతి, శాఖ లేక జనజాతి సభ్యులకు గాని ఒక జాతిలోని, శాఖలోని లేక జనజాతిలోని భాగము యొక్క సభ్యులకుగాని ఈ చట్టపు నిబంధనలను వర్తింపజేయుట అసాధ్యమునియైనను, ఉచితయుక్తము కాదనియైనను తలచినచో, ఈ చట్టము చేయబడినప్పటినుండి గతకాలిక ప్రభావముతోగాని భవిష్యకాలిక ప్రభావముతోగాని ఈ చట్టపు నిబంధనలన్నింటిని లేక వాటిలో ఏవైనా కొన్నింటిని అట్టి సభ్యులకు వర్తించకుండునట్లు ఆయాసమయములందు ఉత్తరువుద్వారా చేయవచ్చును.

(ఈ రాజ్య ప్రభుత్వము) ఏదైనా అట్టి ఉత్తరువును ఉపసంహరించవచ్చును. కాని ఆ ఉపసంహరణమును గతకాలిక ప్రభావము కలిగి యుండునట్లు చేయరాదు.

ఈ పరిచ్ఛేదము క్రింది అన్ని ఉత్తరువులు మరియు ఉపసంహరణములు రాజపత్రములో ప్రచురింపబడవలెను.

3. రద్దు చేయు చట్టము, 1876 (1876లోని 12వ చట్టము) 1వ పరిచ్ఛేదము మరియు అనుసూచి ద్వారా రద్దు చేయబడినది. ప్రారంభము.

## 11. వివాహిత స్త్రీల వేతనములు మరియు సంపాదనలు

4. ఈ చట్టము చేయబడిన పిమ్మట ఎవరేని వివాహిత స్త్రీ యొక్క భర్తచే కాకుండా ఆమెచే నిర్వహింపబడిన ఏదేని ఉద్యోగము, ఉప జీవిక లేక వ్యాపారములో ఆమెచే ఆర్జింపబడినట్టి వేతనములు మరియు సంపాదనలు, వివాహిత స్త్రీల సంపాదనలు వారి ప్రత్యేక ఆస్తిగా ఉండుట.

మరియు ఏదేని సాహిత్య, కళాత్మక, లేక వైజ్ఞానిక కౌశలమును ఉపయోగించి ఆమెచే అట్లు ఆర్జింపబడిన ఏదైన ధనము లేక ఇతర ఆస్తికూడ,

మరియు అట్టి వేతనములు, సంపాదనలు మరియు ఆస్తిలోనుండి చేసిన పొదుపు లన్నియు, వాటి పెట్టుబడిలన్నియు,

ఆమె ప్రత్యేక ఆస్తిగా భావింపబడవలెను. అట్టి వేతనములు, సంపాదనలు మరియు ఆస్తి తనకు ముట్టినట్లు ఆమె ఇచ్చిన రసీదులు మాత్రమే అందుకొరకు సరియైన ఉన్మోచనములు అగును.

## III. భార్యలచే మరియు భర్తలచే భీమాలు

వివాహిత స్త్రీ భీమాపాలసీ తీసికొన వచ్చును.

5. వివాహిత స్త్రీ ఎవరైనను, తన భర్తపై ఆధార పడకుండ తన తరపున భీమా పాలసీ తీసికొన వచ్చును. మరియు అట్లు తీసికొనబడినదని ప్రత్యక్షముగా దానిపై అభివ్యక్తము చేయబడిన ఎడల, ఆ పాలసీయు దానివలన కలుగు మేలంతయును ఆమె ప్రత్యేక ఆస్తిగా ఉండును. అట్టి పాలసీ సాక్షిభూతముగాగల ఆకాంట్రాక్టు ఒక అవివాహితస్త్రీతో చేసికొనిన ఎట్లో అట్లే, చెల్లెడిదై యుండును.

భార్య మేలు కొరకు భర్తచే భీమా.

6. (1) ఎవరేని వివాహితుడైన పురుషునిచే అతని జీవితము పైన తీసికొనబడినదై, అతని భార్య యొక్క లేక భార్య మరియు పిల్లల యొక్క లేక వారిలో ఎవరియొక్క మేలుకొరకైనను తీసికొనబడినట్లు ప్రత్యక్షముగా దానిపై అభివ్యక్తముచేయబడినట్టి భీమా పాలసీ, అట్లు అభివ్యక్తము చేయబడిన హితము ననుసరించి అతని భార్యయొక్క లేక భార్య మరియు పిల్లల యొక్క లేక వారిలో ఎవరియొక్క మేలుకొరకైనను ఏర్పడియుండు ఒక ట్రస్టుగా భావింపబడవలెను. మరియు ఆ ట్రస్టుయొక్క లక్ష్యము ఏదేని నెరవేరక యున్నంతవరకు ఆ భీమా పాలసీ భర్త యొక్క లేక అతని ఋణదాతల యొక్క నియంత్రణకు అధీనము కారాదు లేక అతని సంపదలో భాగము కారాదు.

పాలసీ ద్వారా భీమా చేయబడిన మొత్తము చెల్లింపబడవలసి నప్పుడు ఆ మొత్తమును తీసికొని ఉంచుకొనుటకు ప్రత్యేకముగా ట్రస్టీలు తగు రీతిగా నియమింపబడిననే తప్ప, ఆ భీమా ఏ కార్యాలయములో తీసికొనబడినదో ఆ కార్యాలయము ఉన్నట్టి రాజ్యము యొక్క అధికారిక ట్రస్టీకి ఆ మొత్తము చెల్లింపబడవలెను, మరియు ఆ మొత్తము అతనిచే తీసికొనబడి ఆ పాలసీలో అభివ్యక్తముచేయబడిన ట్రస్టులకొరకు లేక వాటిలో అప్పటికి మిగిలియున్న వాటి కొరకు ఉంచుకొనబడవలెను.

మరియు అట్టి మొత్తమును గురించి అన్ని విషయములలోను అతడు 1864 యొక్క 17వ చట్టములోని 10వ పరిచ్ఛేదము క్రింద ఒక అధికారిక ట్రస్టీ పదవిలో ఉండుటకు ఉన్నతన్యాయస్థానముచే, తగు రీతిగా ట్రస్టీగా నియమింపబడినచో తాను ఉండియుండెడు స్థితినే కలిగియుండును.

ఇందులో ఉన్నదేదియు, ఋణదాతలను మోసగించు ఉద్దేశముతో తీసికొనబడిన ఏదేని భీమా పాలసీ క్రింద వచ్చిన ధనమునుండి చెల్లింపుపొందుటకు ఎవరేని ఋణదాతకు గల హక్కును నాశము చేయదు లేక ఆటంకపరచదు,

(2) 2వ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికిని, ఉపపరిచ్ఛేదము (1) లో నిర్దేశింపబడినట్టి భీమా పాలసీ—

(ఏ) ఎవరేని హిందువుచే, మహమ్మదీయునిచే, సిక్కుచే లేక జైనునిచే—

(i) 1913 డిసెంబరు ముప్పది ఒకటవ దినము తరువాత మదరాసులో, లేక

(ii) 1923 ఏప్రిల్ మొదటి దినము తరువాత, వివాహిత స్త్రీల ఆస్తి (విస్తరణ) చట్టము, 1959 ప్రారంభమగుటకు అవ్యవహిత పూర్వము ఈ చట్టము విస్తరించి యుండినట్టి ఏదైన ఇతర రాజ్యక్షేత్రములో, లేక

(iii) వివాహిత స్త్రీల ఆస్తి (విస్తరణ) చట్టము, 1959 ప్రారంభమైన మీదట, లేక అప్పటినుండి, ఈ చట్టము విస్తరించునట్టి ఏదైన రాజ్యక్షేత్రములో అట్లు ప్రారంభమైన మీదట మరియు అటు పిమ్మట,

(బి) ఒక బౌద్ధునిచే వివాహిత స్త్రీల ఆస్తి (విస్తరణ) చట్టము, 1959 ప్రారంభమైన మీదట, లేక అటు పిమ్మట, ఈ చట్టము విస్తరించు ఏదైన రాజ్య క్షేత్రములో

ఆ భీమాపాలసీ తీసికొనబడినచో, (1)వ ఉపపరిచ్ఛేదము యొక్క నిబంధనలు ఆ పాలసీకి వర్తించును:

అయితే, దీనిలో నున్నదేదియు

(i) ఖండము (ఏ) యొక్క ఉపఖండము (i) లేక ఉపఖండము (ii) వర్తించునట్టి ఏదైన సందర్భములో 1923 ఏప్రిల్ మొదటి దినమునకు పూర్వము, లేక

(ii) ఖండము (ఏ) యొక్క ఉపఖండము (iii) లేక ఖండము (బి) వర్తించునట్టి ఏదైన సందర్భములో, వివాహితస్త్రీల ఆస్తి (విస్తరణ) చట్టము, 1959 ప్రారంభ మగుటకు పూర్వము

ఒక సమర్థ న్యాయస్థానము ఇచ్చినట్టి ఏదైన డిక్రీ క్రింద ప్రాప్తించిన లేక ఉపగతమైన ఏదైన హక్కుకు,

## IV. వివాహిత స్త్రీలచే లేక వారిపై శాసనబద్ధ చర్యలు

7. వివాహిత స్త్రీ భారత ఉత్తరాధికార చట్టము, 1865, (1865 లోని 10వ చట్టము) యొక్క ఈ చట్టము యొక్క అమలు వలన తన ప్రత్యేక ఆస్తియైన ఏ రకపు ఆస్తినైనను రాబట్టుకొనుటకై తన పేరిట దావా నడుపవచ్చును, మరియు అట్టి ఆస్తి రక్షణ కొరకు, భద్రత కొరకు తన పేరిటనే తాను అవివాహితయై యుండిన ఎట్లో అట్లే వ్యక్తులందరి విషయమునను సివిలు మరియు క్రిమినలు పరిహారములకు హక్కు కలిగి యుండును. మరియు అట్టి ఆస్తిని గూర్చి దావాలకు, ఆదేశికలకు, ఉత్తరువులకు, ఆమె వివాహిత కాకుండిన ఎట్లో అట్లే గురిచేయదగి యుండును.

లేక వివాహిత స్త్రీలు శాసనబద్ధ చర్యలు తీసి కొనవచ్చును.

8. వివాహిత స్త్రీ (ఆమె వివాహము 1866 జనవరి మొదటి దినమునకు పూర్వము జరిగినను తరువాత జరిగినను) ప్రత్యేకముగా ఆస్తిని కలిగి యుండి, ఏ వ్యక్తి యైనను ఆమెతో ఒక కాంట్రాక్టును, అట్టి ఆస్తిని గురించి గాని, కాంట్రాక్టు నుండి ఉత్పన్నమగు ఆమె బాధ్యత ఆమె ప్రత్యేక ఆస్తినుండి తీర్చబడునను నమ్మకముతో గాని, చేసికొనినచో, ఆమెపై దావా వేయుటకును, కాంట్రాక్టు జరిగిన తేదీన ఆమె అవివాహితగానుండి డిక్రీ అమలు పరచు వరకు అవివాహితగానే ఉండినచో అట్టిదావా ద్వారా అతడు రాబట్టుకొన గలిగియుండెడి దానిని దేనినైనను, ఆమె ప్రత్యేక ఆస్తి మేరకు, ఆమెనుండి రాబట్టుకొనుటకును, అట్టి వ్యక్తికి హక్కు ఉండును.

వివాహానంతర ఋణములకు భార్య బాధ్యత.

అయితే—

(ఏ) ఏదైన ఆస్తి ఒక స్త్రీకి లేక ఆమె మేలు కొరకు బదిలీ చేయబడి, ఆ ఆస్తిని లేక దానిలో ఆమెకు గల లాభదాయక హితమును ఆమె వివాహితగా తాను ఉండగా బదిలీ చేయుటకు లేదా దానిపై ప్రభారము కల్పించుటకు అధికారము కలిగి యుండరాదను షరతు విధింపబడి యుండినచో, ఆ ఆస్తిని జప్తుచేసి విక్రయించుటద్వారా గాని లేక ఆ ఆస్తి నుండి అన్యథాగాని దేనినైనను రాబట్టుకొనుటకు అట్టి వ్యక్తికి దీనిలోనున్న దేదియు హక్కు కలిగించదు, లేక

(బీ) భార్యను తన ఏజంటుగా అభివ్యక్తముగా నైనను గర్భితముగా నైనను నియోగించి చేసిన ఋణములు చెల్లించుటకు భర్తకుగల బాధ్యతకు దీనిలో నున్న దేదియు భంగము కలిగించదు.

## V భార్య ఋణములకు భర్త బాధ్యత

9. 1865 డిసెంబరు ముప్పది ఒకటవ దినము తరువాత వివాహము చేసికొనిన భర్త ఆ వివాహమునకు పూర్వము అతని భార్యచే చేయబడిన ఋణములకు, అట్టి వివాహ కారణమున మాత్రమే, బాధ్యుడు కాడు, కాని అందు కొరకు భార్యపై దావా వేయబడవచ్చును మరియు ఆమె యొక్క ప్రత్యేక ఆస్తి మేరకు ఆమె అవివాహితగానే యుండిన ఎట్లో అట్లే, అట్టి ఋణములను తీర్చుటకు ఆమె బాధ్యురాలగును:

వివాహ పూర్వము భార్య చేసిన ఋణములకు భర్త బాధ్యుడు కాకుండుట.

అయితే, తన భార్యచే వివాహ పూర్వము, చేయబడినఋణములకు సంబంధించి ఈ చట్టము చేయబడుటకు పూర్వము భర్త చేసికొని యుండినట్టి ఏదేని కాంట్రాక్టును ఈ పరిచ్ఛేదములోనున్నదేదియు చెల్లనిదిగ చేయదు.

వినాయింపు.

## VI. భార్య వలన కలిగిన ట్రస్టుభంగమునకు లేక మృతుని ఆస్తికి ఆమె చేసిన చెరుపునకు భర్త బాధ్యత.

10. ఒక స్త్రీ, వివాహమునకు పూర్వముగాని తరువాతగాని ట్రస్టీ, నిర్వాహకురాలు, లేక ఆస్తిపరిపాలకురాలుఅయినచో, ఆమె భర్తకు ఆ ట్రస్టునందు లేక ఆస్తి పరిపాలనమునందు ప్రమేయమున్ననే తప్ప, లేక అతను అందు జోక్యము కల్పించుకొనిననే తప్ప ఆమె వలనగలిగిన ఏదైన ట్రస్టుభంగమునకు గాని, మృతుని సంపదకు ఆమెచే కలిగింపబడిన లేక చేయబడిన ఏదైన దుర్వినియోగము, నష్టము, లేక చెరుపునకుగాని మృతుని ఆస్తిలోని ఏదైన భాగమును రాబట్టుటలో ఆమె చేసిన ఉపేక్ష వలన అట్టి సంపదకు కలిగిన ఏదైన నష్టమునకు గాని, ఆమె భర్త బాధ్యుడు కాడు.

భార్య చేసిన ట్రస్టు భంగమునకు లేక మృతుని ఆస్తికి అమె చేసిన చెరుపునకు భర్త బాధ్యతా పరిధి.